సాక్షి ఒడిశా

ఆదివారం । 5 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.92.458లు, బంగారం 1 గ్రాము450 మిల్లీగ్రాములు. వెండి 109గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ అన్నారు.

- 8లో



పాముకాటుతో బాలుడు మృతి

పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ-79 పోలీసుస్టేషన్ పరిధిలోని బోవన్‌పల్లి పంచాయతీలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.

- 8లో

న్యూస్‌రీల్

'నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలం'



మాట్లాడుతున్న ఆప్ అభ్యర్థి గౌరీ చరణ్‌దేవ్ శర్మ

జయపురం: దేశం, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని జయపురం నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి గౌరీ చరణ్ దేవ్ ధ్వజమెత్తారు. నియోజకవర్గం పరిధి బొరిగుమ్మలో ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి, మరోసారి అధికారం చేపట్టేందుకు ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రతి ఏడాదీ 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, ప్రతి పౌరుడి అకౌంట్‌లో రూ.15 లక్షల చొప్పున డబ్బులు వేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగ సమస్య విలయ తాండవం చేస్తోందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ధరలను అదుపు చేయడంతో మోదీ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. దేశంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు సరికదా, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వం సైతం బీజేపీ అడుగుజాడల్లోనే నడుస్తోందని ఆరోపించారు. ఆప్‌ను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.

'ఎన్నికల తర్వాత పాండ్యన్ పారిపోతారు'



మాట్లాడుతున్న సుభాష్ సాహు

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్ర 5టీ చైర్మన్ వీకే పాండ్యన్ రాష్ట్రం విడిచి పారిపోతారని గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుభాష్ సాహు ఆరోపించారు. లంజిపల్లి బైపాస్ రోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒడిశా రాష్ట్రానికి అమలు చేసిన పలు సంక్షేమ పథకాల అవినీతికి సంబంధించి పాండ్యన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సమావేశంలో బరంపురం యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి సునీల్ సాహు, పితవాసి పండా, టి.గోపి తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



అవగాహన కల్పిస్తున్న సుమన్ జెన

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవా సభాగృహంలో జీవణ వస్తు పరిచాలన, ప్రజాపయోగ లోక్ అదాలత్‌లపై న్యాయ సచేతన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారణపతి సుమన్ జెన హాజరయ్యారు. గౌరవ అతిథిగా హరిశ్చంద్ర ముదులి పాల్గొన్నారు. సుమన్ జెన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు అందరికీ న్యాయం చేకూర్చేందుకు పనిచేస్తాయని, అన్ని విభాగాల న్యాయాధికారులు పాల్గొని కేసులు విచారంచి న్యాయం చేకూర్చుతారని వివరించారు. ముఖ్యంగా సివిల్, మోటార్ ప్రమాదాలు, విద్యుత్, నీటిసరఫరా బిల్లుల వివాదాలు, కుటుంబ విబేధాలు తదితర కేసులు ఉభయ వర్గాలవారిని కూర్చో పెట్టి పరిష్కరించటం జరుగుతుందన్నారు. ప్రజాపయోగ కార్యక్రమాల్లో ప్రజల కోసం ప్రభుత్వాలు అమలు పరిచే వివిధ సంక్షేమ పథకాలైన వృద్ధాప్య పింఛన్, వితంతు పింఛన్, టెలిఫోన్, రోడ్లు, విద్యుత్, వాటర్, రేషన్ కార్డులు, ప్రయాణ సౌకర్యాలు ప్రజలకు పొందలేకపోతున్నారో, పబ్లిక్ యుటిలిటీ సర్వీస్‌లు పొందలేక పోతున్నారో వారికి సహకరించటం జరుగుతుందన్నారు.

డబ్బుల్లేవు.. పోటీ చేయలేను



సుచరిత మహంతి

- పూరీ బరిలో నుంచి తప్పుకున్న సుచరిత
- ప్రచారానికి నిధులు లేవని ఆవేదన
- కాంగ్రెస్ పార్టీ నిధులు కేటాయించకపోవడంతో పోటీకి వెనుకంజ

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. పూరీ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ధీటైన అభ్యర్థిగా పరిగణించి సుచరిత మహంతికి కాంగ్రెస్ పార్టీ టికెట్టు కేటాయించింది. అయితే ఆమె చివరి క్షణంలో పోటీ చేయలేనని తేల్చి చెప్పారు. దీంతో ఈ షాక్ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ కోలుకోలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఎన్నికల ప్రచారానికి తగినంత డబ్బు తనవద్ద లేదని పేర్కొన్నారు. పార్టీ నుంచి ఆర్థిక సాయం మంజూరైతే తప్ప పోటీ చేయలేనని పేర్కొన్నారు. ప్రచారానికి అవసరమైన నిధులను పార్టీ మంజూరు చేయనందున వైదొలుగుతున్నట్లు స్పష్టం చేశారు.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శికి లేఖ

ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కె.సి.వేణు గోపాల్‌కు సుచరిత మహంతి లేఖ రాశారు. పూరీ పార్లమెంటరీ నియోజకవర్గంలో పార్టీ తనకు నిధులు నిరాకరించినందున ప్రచారం తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నారు. తాను సాధారణ జీతం తీసుకునే ఒక ప్రొఫెషనల్ జర్నలిస్ట్ అని, 10 సంవత్సరాల క్రితం రాజకీయాల్లోకి వచ్చి పూరీలో ప్రచారానికి ఉన్నదంతా వెచ్చించినట్లు పేర్కొన్నారు. ప్రగతి శీల రాజకీయాల కోసం ప్రచారానికి మద్దతు ఇవ్వడానికి ప్రజా విరాళం డ్రైవ్‌ను ప్రయత్నించానని వెల్లడించారు. అయితే ఇప్పటివరకు పెద్దగా ప్రయోజనం కనిపించలేదని వాపోయారు. ప్రచార వ్యయం అంచనాని కుదించేందుకు ప్రయత్నించినా సానుకూలత కనుచూపు మేరల్లో లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం నిధుల కొరతతో పూరీలో ప్రచారానికి దూరంగా ఉంటున్నానని వివరించారు.

చివరి ఘడియల్లో...

రాబోయే మూడో దశ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయడానికి రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ దశలో సుచరిత మహంతి టిక్కెట్టును వదులుకోవడంతో కాంగ్రెస్ ఊహాతీత ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈనెల 25న జరగబోయే మూడో దశ ఎన్నికల్లో పూరీ నామినేషన్ దాఖలు చేయడానికి గడువుకు రెండు రోజుల ముందు సుచరిత మహంతి ఇలా స్పందించి, ఇంతవరకు నామినేషన్ దాఖలు చేయకుండా పోటీకి దూరంగా ఉంటున్నారు. పదేళ్ల క్రితం 2014 ఎన్నికల్లో పోటీ చేసిన సుచరిత మహంతి రెండో స్థానంలో నిలిచింది. ఆ ఎన్నికల్లో ఆమెతో పోటీపడిన బిజూ జనతా దళ్‌కు చెందిన పినాకి మిశ్రా 2 లక్షలకు పైగా ఓట్లతో గెలిపొందారు.

నేడు రాష్ట్రానికి పీఎం మోదీ రాక

- సోమవారం నుంచి ఎన్నికల ప్రచారం
- ఈనెల 10న భువనేశ్వర్‌లో రోడ్ షో



భువనేశ్వర్: రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజధాని నగరానికి ఆదివారం విచ్చేయనున్నారు. అనంతరం సోమవారం ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ పర్యటన ముగిసిన కొద్దిరోజుల్లో ప్రధాని నరేంద్రమోదీ మరోసారి రాష్ట్రానికి విచ్చేయనున్నట్లు సమాచారం. ఈనెల 10న భువనేశ్వర్‌లో రోడ్ షో కార్యక్రమంలో పాల్గొని మర్నాడు 11న బొలంగీర్‌లో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఆయన ఆదివారం రాత్రి 9.30 గంటలకు భువనేశ్వర్ చేరుకోనున్నారు. స్థానిక రాజ్ భవన్‌లో రాత్రి బస చేయనున్నారు. సోమవారం ఆయన బరంపురం, నవరంగపూర్‌లలో బహిరంగ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. మోదీ రాష్ట్ర పర్యటన వివరాలను బీజేపీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు గోలక్ మహాపాత్రో తెలియజేశారు.

మూడంచెల భద్రత వ్యవస్థ

ప్రధానమంత్రి పర్యటన నిమిత్తం భువనేశ్వర్‌లో కమిషనరేట్ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. విమానాశ్రయం నుంచి రాజ్‌భవన్ వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. రాజ్ భవన్‌కు మూడంచెల భద్రత ఏర్పాట్లు చేస్తారు. మోదీ పర్యటన సందర్భంగా పోలీసులు డ్రోన్ల వినియోగం, ప్రయోగం నేపథ్యంలో నో ఫ్లయింగ్ జోన్‌ను ప్రకటించారు. శనివారం సాయంత్రం పోలీసులు కార్కేడ్ రిహార్సల్ నిర్వహించారు.

నగరంలో రోడ్ షో సన్నాహాలు

రాష్ట్రంలో రాబోయే ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 10న భువనేశ్వర్‌లో రోడ్ షో నిర్వహించే అవకాశం ఉంది. భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని భువనేశ్వర్ ఏకామ్ర, భువనేశ్వర్ (ఉత్తర), భువనేశ్వర్ (సెంట్రల్) 3 అసెంబ్లీ సెగ్మెంట్ ప్రాంతాల అనుసంధానంతో రోడ్ షో కార్యక్రమం ప్రణాళిక తుది మెరుగులు దిద్దుకుంటోంది. రోడ్ షో సుమారు రాత్రి 9 గంటలకు ఫైర్ స్టేషన్ స్క్వేర్ నుంచి ప్రారంభమై జయదేవ్ విహార్ వద్ద ముగుస్తుందని పార్టీ శ్రేణుల సమాచారం. భువనేశ్వర్ లోక్‌సభ స్థానం నుంచి తిరిగి పోటీ చేయాలనుకుంటున్న బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ అపరాజిత షడంగి అధ్యక్షతన శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈ మేరకు సమావేశం జరిగింది. నగరంలో 3 అసెంబ్లీ స్థానాల్లో పోటీకి ఖరారైన వారితో పాటు, ఖుర్దా జిల్లాలోని జయదేవ్ అభ్యర్థి అరబింద ఢాలీ, జట్నీ అభ్యర్థి బిశ్వరంజన్ బొడొజెనా ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రధానమంత్రి రోడ్ షో కార్యక్రమంలో పాలుపంచుకుంటారు.

బీజేడీని గద్దె దించండి



మాట్లాడుతున్న త్రిపుర మాజీ సీఎం విప్లవ్ కుమార్ దేవ్

- త్రిపుర మాజీ సీఎం విప్లవ్ కుమార్ దేవ్

రాయగడ: బీజేడీ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దిస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ అన్నారు. గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం పరిధిలో గల విక్రంపూర్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీకి మద్దతు పలికితే డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో ప్రగతి సాధ్యపడుతుందన్నారు. ఇన్నాళ్లు బీజేడీని గెలిపించిన ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఇటు దేశానికి, రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం కలగలేదని వివరించారు. ఆధునిక, సాంకేతిక పరంగా దేశం ముందుకు వెళుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా మనం కూడా దూసుకుపోవాలంటే బీజేపీకి మద్దతు తెలపాలన్నారు. ఈ సమావేశంలో గుణుపూర్ శాసనసభ నుంచి పోటీ చేస్తున్న త్రినాథ్ గొమాంగొ, కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాళీరాం మాఝి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం



మాట్లాడుతున్న రవికుమార్

బరంపురం: పట్టణంలోని క్రీడా మైదానంలో గంజాం జిల్లా క్రీడా సంఘం ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ శిక్షణ సమ్మర్ క్యాంప్ శనివారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామన్‌వెల్త్ గోల్డ్ మెడలిస్ట్ కె.రవి కుమార్ పాల్గొని క్యాంప్ ప్రారంభించారు. సుమారు నెల రోజుల పాటు జరగనున్న శిబిరంలో నగరంలోని 30 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు శిక్షణ తీసుకోనున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ సాహు, కోచ్ కాజల్, శక్తిధర్ రాజ్‌గురు పాల్గొన్నారు.

మూడంచెల భద్రత ఏర్పాటు



డీసీపీ ప్రతీక్ సింఘ్

భువనేశ్వర్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాజ్ భవన్ వరకు మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు నగర డీసీపీ డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. ప్రధాని భద్రతా కార్యకలాపాల్లో ముగ్గురు డీసీపీలు, 10 మంది ఏసీపీలు, 17 మంది ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జిలు, సీఐఎస్ఎఫ్ సిబ్బందితో సహా 20 ప్లాటున్ల పోలీసు బలగాలను మోహరిస్తున్నట్లు వివరించారు.

అభివృద్ధికి ఓటు వేయండి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విదేశ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్

- విదేశాంగశాఖ మంత్రి జైశంకర్

భువనేశ్వర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒడిశాకు పెద్దపీట వేసిందని, గత పదేళ్లలో రాష్ట్రానికి రూ.18 లక్షల కోట్లను కేంద్ర నుంచి సాయం అందిందని విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒడిశాలో రెండు రోజుల పర్యటన కోసం శనివారం ఉదయం నగరానికి చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. సమర్థవంతమైన సహకారం కోసం ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన కోసం రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ వంటి కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలుకానప్పటికీ ఒడిశా అభివృద్ధికి అన్ని సహాయ, సహకారాలు అందించడంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నడూ వెనుకాడలేదన్నారు. ఒడిశాలో అపారమైన వనరులు ఉన్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా ఆరాధించే గొప్ప సంస్కృతిని కలిగిన రాష్ట్రమన్నారు. ఢిల్లీలో జరిగిన జి- 20 సమ్మిట్‌లో దిగ్గజ కోణార్క్ సూర్య దేవాలయ చక్రం ప్రధాన వేదికగా నిలిచిందని జైశంకర్ గుర్తుచేశారు. ఈ రాష్ట్ర సంస్కృతిపై ప్రధానికి ఎంతో గౌరవం, ఆప్యాయత ఉందో తెలుస్తోందన్నారు. ఒడిశాలో పర్యాటక రంగం పురోగతికి ఇటువంటి పలు కార్యక్రమాల్ని కేంద్రంలో మోదీ సర్కారు చేపడుతుందన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందడానికి మరిన్ని అవకాశాలు ఉంటాయని ఆశిస్తున్నామని చెప్పారు. ప్రధాని మోదీ అభివృద్ధి ప్రణాళికలో ఒడిశాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాష్ట్రంలో 20 పాస్‌పోర్ట్ సపోర్ట్ సెంటర్లు ఏర్పాటు అయ్యాయన్నారు. 2.7 లక్షల మందికి పైగా పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్లు పొందారన్నారు. ఒడిశా మద్దతుతో రానున్న ఎన్నికల్లో లోక్ సభలో బీజేపీ 400 మార్కును దాటనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒడిశా ప్రజలు తమ సత్వర అభివృద్ధి కోసం ఈసారి ప్రధాని మోదీని మరింత బలపరిచేందుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. విదేశాంగ మంత్రిగా పలు దేశాల్లోని ఒడిశా ప్రజల ప్రతిభను, నైపుణ్యాలను మెచ్చుకునే అవకాశం తనకు లభించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఒడిశా ప్రజలు ఓటు వేసినప్పుడు సరైన నిర్ణయం తీసుకుంటారని జైశంకర్ అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



బిసంకటక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమేంద్ర

రాయగడ: జిల్లాలోని మునిగుడ పోలీసుస్టేషన్ పరిధి దొబాగుడ కూడలిలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలవ్వగా, మరొకరు తీవ్రగాయాలకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. సర్కామా గ్రామానికి చెందిన ధర్మేంద్ర జగరంగ (35), అతని స్నేహితుడు అమేంద్ర జగరంగలు బైకుపై ఏదో పని మీద మునిగుడ వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొన్నారు. ఈ ఘటనలో ధరేంద్ర తీవ్రగాయాలకు గురై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అలాగే గాయాలు పాలైన అమేంద్రను మునిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. అయితే అమేంద్ర ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బిసంకటక్‌లోని క్రిస్టియన్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోస్టల్ బ్యాలెట్ కోసం క్యూ కట్టిన పోలింగ్ సిబ్బంది

పర్లాకిమిడి: అసెంబ్లీ, బరంపురం పార్లమెంటరీ ఎన్నికల విధుల్లో చేరిన పోలింగ్, ప్రిసైడింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్‌లను స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో అధికారులు అందజేశారు. ఎన్నికల విధుల్లో చేరిన ఉద్యోగులు, పోలింగ్ అధికారులు, అసిస్టెంటు పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో కూడా ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారులు నిర్వహించారు. జిల్లాలోని కాశీనగర్, గుమ్మా, గుసాని, రాయగడ, ఆర్.ఉదయగిరి, నువాగడ, మోహనా సమితిల నుంచి వేలాది మంది పోలింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు ఈ పోస్టల్ బ్యాలెట్‌లో పాల్గొన్నారు.



పర్లాకిమిడి మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్



పోస్టల్ బ్యాలెట్‌ను క్లోజింగ్ కవర్‌లో అందజేస్తున్న అధికారులు

బీజేడీకి ఓటు-అభివృద్ధికి చోటు

- ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్
- కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో పర్యటన



నబరంగ్‌పూర్ వేదికపై సీఎం నవీన్‌పట్నాయక్, 5టీ చైర్మన్ పాండ్యన్, బీజేడీ అభ్యర్థులు

కొరాపుట్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేడీ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారా అభివృద్ధికి చోటు కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కోరారు. శనివారం కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలలో పర్యటించి ఎన్నికల ప్రచార బహిరంగ సభల్లో మాట్లాడారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ఓఎంపీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గత 25 ఏళ్లగా తమ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని వివరించారు. మరోసారి తమ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తమను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ జంక్షన్ వద్ద జరిగిన సభలో ఆయన ఆకట్టుకునేలా ప్రసంగించారు. ప్రజా సంక్షేమ పథకాలను ఎవరు అమలు చేస్తున్నారని అడగ్గా.. ప్రజలు స్పందిస్తూ నవీన్ పట్నాయక్ అంటూ నినాదాలు చేశారు. పథకాలన్నీ బాగున్నాయా అని అడగ్గా..చాలా బాగున్నాయని కేకలు వేశారు. అయితే వాటిని కొనసాగించడానికి ఎవరికి ఓటు వేస్తారని నవీన్ ప్రశ్నించగా బీజేడీకి ఓటు వేస్తామని ప్రజలు బదులిచ్చారు. రెండు సభల్లో కొరాపుట్, మల్కన్‌గిరి, నబరంగ్‌పూర్ జిల్లాల్లోని బీజేడీ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులను వేదికపైనుంచి నవీన్‌పట్నాయక్ ప్రజలకు పరిచయం చేశారు. ముఖ్యమంత్రి వక్తిగత సలహాదారుడు, 5టీ చైర్మన్ కార్తికేయ పాండ్యన్ పాల్గొన్నారు.



కొరాపుట్‌లో ప్రసంగిస్తున్న జయపూర్ బీజేడీ అభ్యర్థి ఇందిరా నందో. వేదికపై సీఎం నవీన్ తదితరులు



నబరంగ్‌పూర్ సభకు హాజరైన జనం



నవీన్‌పట్నాయక్ మాస్క్‌తో కార్యకర్త సందడి

క్లుప్తంగా

మీ ఓటు - మీ హక్కుపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లా కలిమెల సమితిలో యంవీ 79 పోలీసు స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శనివారం మల్కన్‌గిరి ఎస్‌డీపీఓ సచిన్ పటేల్ ఆధ్వర్యంలో మీ ఓటు- మీ హక్కుపై ప్రజల్లో చైతన్యం కాల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఐఐసీ సుభాష్ చంద్ర కర్క, సిబ్బంది, బీఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడు మృతి



చంద్రన్ మృతదేహం

మల్కన్‌గిరి: పాముకాటుతో బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ-79 పోలీసు స్టేషన్ పరిధిలోని బోవన్‌పల్లి పంచాయతీలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ఘటనలో చంద్రన్ (12) ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం రాత్రి ఇద్దరు కుమారులతో కలిసి తల్లి భోజనాలు చేశారు. అనంతరం వేసవి కావడంతో ఇంటి బయట అరుగుపై పడుకున్నారు. అయితే చిన్న కుమారుడు చంద్రకు అర్ధరాత్రి సమయంలో పాముకాటు వేసింది. ఆ విషయం తెలియక తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో పిల్లలను తల్లి లేపింది. చంద్ర నోటి నుంచి నూరగ రావడాన్ని గమనించింది. ఎడమ కాలుపై కాట్లు చూసి పాము కరిచి ఉంటుందని గుర్తించింది. పెద్ద కుమారుడు సురేష్‌తో అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ సిబ్బంది బాలుడుని వాహనంలో ఎంవీ-79 గ్రామంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. బాలుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు

కత్తితో దాడిచేసి.. ఆస్పత్రిలో చేర్పించి..!

జలుమూరు : మండలంలోని కొమనాపల్లి పంచాయతీకి చెందిన గొల్లంగి నవీన్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బైరి సింహాచలం శనివారం వేకువజామున కత్తితో దాడిచేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లంగి నవీన్‌కుమార్ వద్ద బైరి సింహాచలం ఆరు నెలల కిందట రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలంటూ మూడు నెలలుగా నవీన్ అడుగుతున్నా సింహాచలం స్పందించడం లేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో సింహాచలం నవీన్‌కు ఫోన్ చేసి అప్పు తీర్చేస్తానని ఇంటికి రమ్మని పిలిచాడు. ఉదయం వస్తానని చెప్పి నవీన్ ఫోన్ కట్‌చేశాడు. మళ్లీ సింహాచలం శనివారం వేకువజామున నాలుగున్నర గంటలు సమయంలో నవీన్‌కు ఫోన్‌చేసి డబ్బులు తీసుకునేందుకు కొమనాపల్లి-అచ్యుతాపురం వాటర్ టాంక్ వద్దకు రమ్మని పిలిచాడు. నిజమే అనుకొని నవీన్ వెళ్లగా సింహాచలం తన ద్విచక్ర వాహనంలో దాచి ఉంచిన కత్తితో పొడిచాడు. దీంతో కిందపడి ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న నవీన్‌ను చూసి భయపడి నిందితుడు సింహాచలమే నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సింహాచలంపై ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సోంపేట: మండలంలోని పాలవలస రైల్వే గేటు సమీపంలో శనివారం రైలు ఢీకొని పాలవలసకు చెందిన దున్న లక్ష్మీనారాయణ (62) మృతి చెందాడు. ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో గూడ్స్ ట్రైన్ ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. లక్ష్మీనారాయణకు భార్య శేషమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె జ్ఞానేశ్వరికి వివాహం కాగా, కుమారుడు కిషోర్‌కుమార్ వలస కార్మికుడిగా వేరే రాష్ట్రంలో ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రోడ్డు పక్కన ఓ వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉండటం స్థానికులు గుర్తించారు. వివరాలు ఆరా తీయగా మెళియాపుట్టి మండలం కరజాడ గ్రామానికి చెందిన సవర సంజీవరావుగా గుర్తించారు. వెంటనే 108 అంబులెన్సులో టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వల్ల గానీ, అదుపుతప్పి పడిపోవడం వల్ల గానీ గాయపడి ఉండవచ్చని స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. కుడి కాలు విరిగిపోవడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

పుష్కరాలకు వెళ్లిన మహిళ మృతి

టెక్కలి రూరల్: దైవ దర్శనానికి వెళ్లిన టెక్కలి చెందిన టంకాల మంగ(42) అనే వివాహిత శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందింది. ఈమె మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న నర్మదా నది పుష్కరాలకు వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని ఆదివారం టెక్కలి తీసుకొస్తున్నట్లు చెప్పారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పర్లాకిమిడి ఎన్నికల సభలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

పర్లాకిమిడి:

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం శనివారం సాయంత్రం పర్లాకిమిడి వచ్చారు. గజపతి స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నాలుగున్నర కోట్ల ఒడియా ప్రజలు బాగున్నారా? లక్ష్మీబస్సులు, మిషన్ శక్తి, మమతా పథకం, మధుబాబు పింఛను, బీఎస్‌కేవై పథకాలు? పూరీ ధాం, స్కాలర్‌షిప్పులు బాగున్నాయా, నవీన్ పట్నాయక్ బాగున్నాడా? ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయా? నన్ను ఆశీర్వదిస్తారా? శంఖం గుర్తుకు ఓటేస్తారా అని నవీన్ పట్నాయక్ వేదిక పైనుంచి ప్రశ్నించారు. అనంతరం బరంపురం ఎంపీ అభ్యర్థి భృగు భక్షి పాత్రో మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమానికి కృషిచేస్తున్న తమను కాదని.. బీజేపీని గెలిపిస్తే బిజూ స్వస్థ్యకల్యాణ్ సమితి (ఆరోగ్యశ్రీ) కార్డులు, మిషన్ శక్తి, మహిళలకు డ్వాక్రా రుణాలు ఎత్తివేయడం ఖాయమని ఆరోపించారు. ఇప్పటివరకూ బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేకపోయిందన్నారు. కేబినెట్ మంత్రి వి.కె.పాండియన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదేళ్లలో 85 లక్షల మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. పర్లాకిమిడి అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి, మోహానా నియోజకవర్గం అభ్యర్థి అంతర్యామి గోమాంగో, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావులు ఐదేళ్లలో బీజేడీ సర్కార్ చేసిన అభివృద్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో శంఖం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాగా తొలుత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు బిజూ జనతా దళ్ పార్టీ జిల్లా అధ్యక్షులు జగబంధు దాస్, పర్లాకిమిడి, మోహానా నియోజకవర్గాల అభ్యర్థులు రూపేష్ పాణిగ్రాహి, అంతర్యామి గోమాంగో, మారుత్‌కుమార్ పాలో తదితరులు ఘనంగా స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వేదికపైకి వచ్చి సభకు వచ్చిన మహిళలకు, ప్రజలకు అభివాదం చేశారు.



పర్లాకిమిడి సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

సీఎం సభలో పదనిసలు

- రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మోహానా బీజేడీ అభ్యర్థి అంతర్యామి గోమాంగో గురించి మాట్లాడుతున్నప్పుడు పదేపదే తన కార్యదర్శి పాండియన్‌కు ఆయన పేరు ఏమిటని అడిగారు.
- ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన ప్రసంగంలో బీజేపీని కనీసం ప్రస్తావించలేదు.
- నవీన్ పట్నాయక్ ప్రసంగం చప్పగా సాగడంతో గంటల తరబడి ఎండలో ఉన్నవారంతా అసహనం వ్యక్తం చేశారు.
- నవీన్ పట్నాయక్ అతికష్టంపై వేదికపైకి వచ్చి ఐదు నిమిషాలు మాత్రమే మాట్లాడారు.



సభకు హాజరైన జనం



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో మాట్లాడిస్తున్న వి.కె.పాండియన్



సభకు హాజరైన పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెటి, జెడ్పీటీసీ సభ్యుడు రోక్కం

పురుషులతో సమానంగా..

- నవరంగపూర్ జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో రెండు చోట్ల మహిళలకు కేటాయించిన బీజేడీ, కాంగ్రెస్

జయపురం: నవరంగపూర్ జిల్లాలో పురుష ఓటర్లు కన్నా.. మహిళా ఓటర్లే అధికం. గత ఎన్నికలు పరిశీలిస్తే రాజకీయ రంగంలో మహిళా ప్రాతినిధ్యం నామమాత్రం. ఈ జిల్లాలోగల నాలుగు శాసనసభ నియోజకవర్గాల్లో 8,51,044 ఓటర్లుండగా వారిలో 4,20,737 మంది పురుష ఓటర్లు.. 4,30,248 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ప్రతీ వెయ్యి మంది పురుష ఓటర్లకు 1,023 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గతంలో కొంతమంది మహిళలు ఈ జిల్లా రాజకీయాల్లో చక్రంతిప్పి మంత్రులుగా కూడా పదవులు నిర్వహించారు. వారంతా కాంగ్రెస్ మహిళా నేతలే. జిల్లాలో మహిళ ఓటర్లతో పోల్చితే మహిళలకు తగిన ప్రాతినిధ్యం లభించలేదనే చెప్పవచ్చు. ఆనాడు అంటే 1980, 1985, 1995, 2000లలోఉమ్మరకోట్ నియోజకవర్గంలో పరమ పూజారి విజయం సాధించి మంత్రి పదవులు అలంకరించారు. 1985లో డాబుగాం నియోజక వర్గంలో భగవతి పూజారి, 1980లో కొడింగ నియోజకవర్గం నుంచి ఫుల్‌మణి శాంత శాసన సభలో అడుగుపెట్టారు. రాష్ట్రంలో బీజేడీ పాలన వచ్చిన తరువాత ఒక్క మహిళకు శాసనసభలో ప్రాతినిధ్యం లభించలేదనే చెప్పవచ్చు. ఒక పక్క మహిళలకు చట్ట సభల్లో పురుషులతో పాటు సమాన ప్రాతినిధ్యం ఉండాలని, రాజకీయ పార్టీలు ప్రచారాలు చేస్తున్నాయే కానీ.. తగిన ప్రాధాన్యత కల్పించటంలేదని చెప్పకతప్పదు. ఈ నెల 13న జరుగనున్న ఎన్నికల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని బీజేడీ, కాంగ్రెస్ పార్టీలు నిర్ణయించినట్లు ఆయా పార్టీల అభ్యర్థుల నియమించిన తీరు వెల్లడిస్తుంది. జిల్లాలో నాలుగు స్థానాల్లో రెండు చోట్ల కాంగ్రెస్ మహిళా అభ్యర్థులను నిలపగా.. బీజేడీ కూడా ఇద్దరు మహిళా అభ్యర్థులకు అవకాశం ఇచ్చి మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించింది. నవరంగపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సదాశివ ప్రధాన్‌కు బదులుగా అతడి భార్య కౌశల్య ప్రధాన్‌కు అవకాశం ఇచ్చింది. బీజేడీ, ఆమె తన భర్త ఎమ్మెల్యే అయిన తరువాత రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతూ వస్తున్నారు. ఉమ్మరకోట్‌లో మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండ్ సతీమణి నబీన నాయిక్‌కు అభ్యర్థిగా నిలిపింది. ఈమె రెండు దఫాలు సమితి అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు. బీజేడీ అనుసరించినట్లే కాంగ్రెస్ పార్టీ కూడా డాబుగాం నియోజకవర్గం అభ్యర్థినిగా మాజీ ఎమ్మెల్యే బుజభల మఝి కుమార్తె డాక్టర్ లిపికా మఝిని నిలబెట్టింది. లిపికకు కూడా రాజకీయ అనుభవం ఉంది. ఈమె జిల్లా పరిషత్ సభ్యురాలిగా ప్రజలకు సేవలు అందిస్తూ మన్ననలు పొందారు. తండ్రి బుజభల మఝి నవరంగపూర్ లోక్ సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా తలపడుతున్నారు. ఝోరిగాం నియోజకవర్గంలో హరావతి గోండ్‌ను బరిలోకి దింపింది. ఈమె ఆదివాసీ ప్రజల హక్కులపైన, భూమి, నీరు, అటవీ అధికారాలపైన పోరాటాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నలుగురు సమర్థవంతులైన మహిళలు పోటీలో ఉన్నారు. నవరంగపూర్ జిల్లా ఓటర్లు వీరిని ఎంత వరకు ఆదరిస్తారో వేచి చూడాలి.



కౌశల్య ప్రధాన్ (బీజేడీ - నవరంగపూర్)



లిపిక మఝి (కాంగ్రెస్ - డాబుగాం)



హరావతి గోండ్ (కాంగ్రెస్ - ఝోరిగాం)

హోరాహోరీగా..



ప్రచారం చేస్తున్న బరంపురం బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రమేష్ చంద్రచౌవ్ పట్నాయక్

- జోరుగా ఎన్నికల ప్రచారం

బరంపురం: ఒకపక్క మండుతున్న ఎండలు.. మరో పక్క సమీపిస్తున్న ఎన్నికల పోలింగ్ గడువు. దీంతో పోటీ బరిలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రచారాలను ముమ్మరం చేశారు. దీంతో ఎక్కడ చూసినా ప్రచార హోరు కనిపిస్తోంది. బీజేడీ, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల అగ్రనేతలు సైతం జోరుగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీ తరఫున పోటీ చేస్తున్న లోక్‌సభ, శాసనసభ అభ్యర్థుల విజయం కోసం జిల్లా దిగపండిలో ఇటీవల భారీ బహిరంగ సభను సైతం ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న జాతీయస్థాయి నేతలు రాష్ట్రంలోని బీజేడీ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. అధికార బీజేడీ పార్టీ మాత్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలే అస్త్రాలుగా చేసుకొని తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారంలో దూసుకుపోతోంది. గంజాం జిల్లాలో ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఈ నెల 13, 18వ తేదీల్లో రెండు విడతల్లో ఈ జిల్లాలో 13 ఎమ్మెల్యే, రెండు లోకసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్‌కు సమయంలో సమీపిస్తుండడంతో అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. భర్తల విజయం కోసం భార్యలు, భార్యల విజయం కోసం భర్తలు వారి అనుచరులతో ప్రచారాలు హోరెత్తిస్తున్నారు. బరంపురం నియోజకవర్గం నుంచి అధికార పార్టీ బీజేడీ తరఫున ఎంఎల్ఏ అభ్యర్థిగా డాక్టర్ రమేష్ చంద్ర చౌవ్ పట్నాయక్, లోకసభ అభ్యర్థిగా భృగుభక్షి పాత్రో, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా దీపక్ పట్నాయక్, బీజేపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ ప్రదీప్ పాణిగ్రాహి, ఎమ్మెల్యే అభ్యర్థిగా కె.అనిల్‌కుమార్, ఇండిపెండెంట్‌గా మాజీ మేయర్ శివ శంకర్ దాస్ పోటీ చేస్తున్నారు. వీరంతా ప్రచారలో దూసుకుపోతున్నారు.



బరంపురంలో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి కె.అనిల్‌కుమార్



పులసరలో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్ సాహు

ఈవీఎంలపై అవగాహన



మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో ఈవీఎంలపై శిక్షణ ఇస్తున్న ఎన్నికల అధికారులు

పర్లాకిమిడి: పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, క్లాస్ 3 ఉద్యోగులకు పర్లాకిమిడి మహారాజా బాలుర ఉన్నత పాఠశాల, శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్ పనితనంపై ఎన్నికల అధికారులు పోలింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులకు తహసీల్దార్ నారాయణ బెహెరా, ఐటీడీఏ, డీఆర్‌డీఏ అధికారులు హాజరయ్యారు.



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు



డిజిటల్ బోర్డుపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎన్నికల బీఈఓ, అధికారులు

అమలుకాని ఎన్నికల నిబంధనలు



జయపురం మార్కెట్ కూడలి వద్ద బీజేడీ హోర్డింగ్



ఎంజీ రోడ్డులో కాంగ్రెస్ హోర్డింగ్

జయపురం: ఎన్నికల నిబంధనలు పలుచోట్ల సక్రమంగా అమలు కావడం లేదు. ఎన్నికల నియమావళిని చాలా పార్టీలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జయపురంలోని పలు ప్రాంతాలలో ఎన్నికల ప్రచార హోర్డింగులు నేటికీ దర్శనం ఇస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలు రద్దీగా ఉండే దైనిక బజార్-ఓల్డ్ ఫిష్ మార్కెట్ కూడలి, పట్టణంలో ప్రధాన కూడలి వెల్‌కం జంక్షన్, మహాత్మా గాంధీ రోడ్డు ప్రాంతాలలో ప్రధాన పార్టీల హోర్డింగ్‌లు ఇప్పటికీ ఉన్నాయి. అభ్యర్థులు, వారి నేతల ఫొటోలతో, ఆయా పార్టీల గుర్తులతో హోర్డింగ్‌లు కనిపిస్తున్నాయి. ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే ఎన్నికల నియమాలు వర్తించటంతో అధికారులు బుల్‌డోజర్లతో పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో ఫ్లెక్సీలను తొలగించారు. అయితే ఆ తరువాత మాత్రం నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదు. ఎన్నికల ప్రచార హోర్డింగ్‌లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

మేలు చేసిన ప్రభుత్వానికి మద్దతివ్వండి

- సీఎం నవీన్ పట్నాయక్
- టికిరిలో భారీ బహిరంగ సభ



సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పక్కనే పాండ్యన్

రాయగడ: రాష్ట్ర ప్రజలకు అనునిత్యం మేలు చేసిన బీజేడీ ప్రభుత్వానికి మద్దతివ్వాలని సీఎం నవీన్ పట్నాయక్ కోరారు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుస్థిర పాలనను అందిస్తున్న బీజేడీ ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ఆయా పథకాలు మీకు నచ్చినట్లయితే మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని పేర్కొన్నారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం

మహిళా సంక్షేమమే బీజేడీ ప్రభుత్వ ధ్యేయమని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. మిషన్ శక్తి, స్వయం సహాయక బృందాలు వంటి పథకాలు వారి ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎంతో మార్పును తీసుకొచ్చాయని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతీ రంగంలో వారికి సరైన ప్రాధాన్యత కల్పిస్తుందని వివరించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూడా మహిళలకు సీట్ల కేటాయింపు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుని వారికి గౌరవాన్ని ఈ ప్రభుత్వం అందించిందన్నారు.

ఇంటింటా లక్ష్మీ పథకం

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎంతోమందికి లక్ష్మీబస్సు పథకం ఒక వరంగా మారిందని ముఖ్యమంత్రి నవీన్ అన్నారు. విద్య, ఆరోగ్య, వ్యవసాయ రంగాల్లో ఆధునిక పోకడలను తీసుకువస్తున్న ఈ ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పిస్తే ఊహించలేని ప్రగతిని చూపిస్తానన్నారు. ఆద్యాంతం ఒడియా భాషలో ప్రసంగించిన ముఖ్యమంత్రి ప్రతీ మాటకు అభిమానులు, కార్యకర్తలు తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

పారిశ్రామిక హబ్‌గా కాసీపూర్

ప్రాకృతిక, ఖనిజ సంపదలకు నిలయమైన కాసీపూర్‌ను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు బీజేడీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఇప్పటికే ఉత్కళ అల్యూమిన వంటి బృహత్తర కర్మాగారం ఏర్పాటు కావడంతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. అదేవిధంగా మరో వేదాంత అలూమిన బృహత్తర పరిశ్రమ మరొకటి ఏర్పాటు కాబోతుందని, దీనివల్ల 4000 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలియజేశారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే ప్రగతి సాధించగలమని వివరించారు.

తప్పుడు మాటలను నమ్మవద్దు

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రతిపక్ష పార్టీలపై దుమ్మెత్తిపోశారు. వారి మాయమాటలను నమ్మవద్దని ప్రజలకు నొక్కిచెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టించిన వారెప్పుడూ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో రెండు శంఖాలపై తమ అమూల్యమైన ఓటును వేసి విధానసభ, లోక్‌సభ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల నోట ప్రభుత్వ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజల మనోగతాన్ని రాష్ట్ర 5టీ అధ్యక్షుడు వీకే పాండ్యన్ తెలుసుకున్నారు. ఒకొక్క పథకం గురించి చెబుతూ ఆయా పథకం వినియోగంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ పథకం ప్రజాహితం కోసం ఏర్పాటైందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు మరో ఐదేళ్ల అవకాశం కల్పిస్తే రాష్ట్రం ప్రగతి దిశగా పయనిస్తుందని తెలిపారు.

అభివృద్ధి దిశగా రాయగడ జిల్లా

రాష్ట్రంలో బీజేడీ పాలన వచ్చిన తర్వాత కాసీపూర్ సమితి అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందని జిల్లా బీజేడీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. ఈ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నవీన్ ఎంతో కృషి చేశారని తెలియజేశారు. ఎప్పటికీ ఈ జిల్లా ప్రజలు నవీన్ పట్నాయక్ సేవలను మరిచిపోలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రఘునాథ్ గొమాంగో, రాయగడ శాసనసభ నుంచి పోటీ చేస్తున్న అనసూయా మాఝి, కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కౌసల్య హికక, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులిలు పాల్గొన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హెలీకాప్టర్‌లో టికిరి చేరుకున్నారు.



ముఖ్యమంత్రికి హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న నెక్కంటి



సీఎం నవీన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సరక తదితరులు



సభకు హాజరైన ప్రజానీకం

క్లుప్తంగా

మృతుడి ఆచూకీ లభ్యం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి – నెలివాడ గ్రామాల మధ్య గల రైల్వే పట్టాల నడుమ ఈ నెల 2న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని రైల్వే పోలీసులు గుర్తించి దర్యాప్తు నిర్వహించారు. మృతుడు బొండపల్లి మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన మామిడి అప్పలనాయుడు(30) గా గుర్తించినట్లు రైల్వే హెచ్‌సీ కృష్ణారావు శనివారం తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు చెప్పారు. బంధువులు మృతదేహాన్ని గుర్తించడంతో పంచనామా నిర్వహించి అప్పగించినట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



చీపురుపల్లి: మద్యం బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేసిన ఎస్‌ఐ

చీపురుపల్లి: మండంలోని కర్లాం సమీపంలో 106 మద్యం బాటిళ్లు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు చెప్పారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో జి.సిగడాం మండలంలోని బాతువ గ్రామానికి చెందిన పైడిరాజు 106 మద్యం బాటిళ్లు రవాణా చేస్తుండగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేశామన్నారు.

జామిలో...

జామి: మండల కేంద్రమైన జామి శివార్లలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తాండ్రంగి గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం బాటిల్స్ పట్టుకెళ్తున్న సమయంలో అతని నుండి మొత్తం 40 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.6వేలు ఉంటుందని ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

బొబ్బిలి : పట్టణంలోని యుద్ధ స్థంభం, పాత బొబ్బిలి మధ్య చెరువు గట్టుపై ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నట్టు గుర్తించామని ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ విలేకర్లకు తెలిపారు. మృతురాలి వయస్సు 45 – 50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతదేహం పక్కనే చుట్టలు, లైటర్, గ్లూకోజ్, పచ్చడి సీసా ఉన్నాయన్నారు. పసుపు రంగు జాకెట్టు, పువ్వుల చీర ధరించి ఉందన్నారు. మూడు రోజుల క్రితం మృతి చెందినట్టు భావిస్తున్నామని, ఖననం చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు వెంకట రమణ(ఫైల్)

బాడంగి: చెడు వ్యసనాలకు బానిసై, అప్పుల పాలైన ఓ యువకుడు జీవితంపై ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి బొబ్బిలి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. బాడంగి మండలం కోటిపల్లికి చెందిన బోను వెంకటరమణ (21) గుర్తు తెలియని రైలు కింద పడి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తల్లిదండ్రులు రమణమ్మ, శంకరరావు సమాచారం మేరకు వెంకటరమణ కొన్నాళ్లుగా రాజమండ్రి దగ్గర చేపల చెరువు వద్ద పని చేసేవాడు. 15 రోజుల కిందట ఇంటికి వచ్చి తిరిగి వెళ్లలేదు. తాగుడు, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే దిక్కు లేక రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పశువులశాలల దగ్ధం

- రూ.4లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గేదె

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో మద్దు ఈశ్వరరావు, మద్దు మంగలకు చెందిన పశువులశాలలు శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోయాయి. రోజులాగే శుక్రవారం రాత్రి పశువులకు మేత వేసి పాకల్లో కట్టి ఇళ్లకు రైతులు వెళ్లిపోయారు. రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న పశువుల శాలలు క్షణాల్లో కాలిపోయాయి. ప్రమాదంలో మంగకు చెందిన ఒక గేదె మృతి చెందగా మరొక గేదె తీవ్రంగా కాలిపోయింది. ఈశ్వరరావుకు చెందిన రెండు గేదెలు మృతి చెందగా మరొక గేదె శరీరం పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 4 లక్షల ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. గాయపడిన పశువులకు మల్లివీడు పశువైద్యాధికారి మండల తులసి వైద్యసేవలను అందించారు.

ఆర్‌బీకేలు... రైతు నేస్తాలు

- విత్తు నుంచి ఎరువుల వరకు అందజేత
- 1,56,575 క్వింటాళ్ల విత్తనాల అందజేత
- 54,507 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా
- ఐదేళ్లలో 15.61 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- ఇందుకు రైతులకు చెల్లించింది రూ.2990.61 కోట్లు



విజయనగరం మండలం రాకోడు రైతు భరోసా కేంద్రంలో రైతులకు విత్తనాలు అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: చంద్రబాబు పాలనలో అన్నదాత అవస్థలు అన్నీఇన్నీ కావు. విత్తనం నుంచి ప్రారంభమయ్యే కష్టాలు పంట దిగుబడులు విక్రయించే వరకు కొనసాగేవి. విత్తనాల కోసం అయితే చాంతాడంత క్యూల్లో నిలబడే పరిస్థితి. ఎరువులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయక తప్పని దుస్థితి. ప్రకృతి విపత్తులు సంభవిస్తే ఇక ఆ రైతు గతి అంతే... పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే చంద్రబాబు పాలనలో వ్యవసాయం ఆయన అన్నట్టే.. దండగగా మార్చేశారు. రాష్ట్రంలో జగనన్న నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. అన్నదాత పరిస్థితి మారింది. రైతు భరోసా పేరిట సాగుకు పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు కొనుగోలు వరకూ అన్నీ తానై ప్రభుత్వం బాధ్యత చేపట్టింది. అన్నదాతకు సాగు దండగ కాదు.. పండగ అనేటట్టు మార్చింది. ఇందుకోసం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి ఎరువుల వరకు పంపిణీ చేయడంతో పాటు దిగుబడుల కొనుగోలు కూడా ప్రభుత్వమే చేపట్టి మద్దతు ధర చెల్లిస్తోంది.

ఆర్‌బీకేలతో బహుళ ప్రయోజనాలు

రైతు భరోసా కేంద్రాలు రాకముందు రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి రైతులు వెళ్లే వారు. అంతేకాకుండా పండించిన ధాన్యాన్ని కూడ విక్రయించుకోవడానికి దూర ప్రాంతంలో ఉన్న మిల్లులు వద్దకు వెళ్లేవారు. రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత రైతు ముంగిటకే సేవలు అందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్దే అందుతున్నాయి. పంట ఉత్పత్తుల కొనుగోలు కూడా రైతు భరోసా కేంద్రాల వద్దే జరుగుతుంది. రైతుల పండించిన ధాన్యాన్ని రైతుల కళ్లాల దగ్గరకు వెళ్లి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఈ–క్రాప్ బుకింగ్, విత్తనాలు రిజిస్ట్రేషన్ ఇలా రైతులకు అవసరమైన అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల్లోనే రైతులకు అందుతున్నాయి. పంట నష్టం జరిగినప్పుడు పంట నష్టం అంచనా వేయడం కూడా రైతు భరోసా కేంద్రం సిబ్బందే చేస్తున్నారు. పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం తదితర సాంకేతిక సహకారం, సూచనలు, సలహాలు అందించేందుకు ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రానికి ఒక వ్యవసాయ సహాయకులను నియమించింది. వారు రైతులకు నేస్తాలుగా మారిపోయారు. రైతుకు అన్ని విధాలా రైతు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలో 510 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి.

ప్రభుత్వమే కొనుగోలు

దళారులు, వ్యాపారుల ప్రమేయం లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ముఖ్యంగా మిల్లర్ల పాత్ర లేకుండా ప్రభుత్వం రైతులకు మేలు చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసింది. రైతులకు రవాణ, కళాసీ చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లించింది.

2019 నుంచి 2022 వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు

సంవత్సరం	ధాన్యం మెట్రిక్ టన్నులలో	చెల్లించిన నిధులు
2019-20	4,52,045	రూ. 869.19 కోట్లు
2020-21	4,60,384	రూ. 869.19 కోట్లు
2021-22	3,06,713	రూ. 595.01 కోట్లు
2022-23	3,41,880	రూ. 697.25 కోట్లు

వైఎస్సార్ రైతు భరోసా నిధుల వివరాలు

సంవత్సరం	రైతులు	వెచ్చించిన నిధులు
2019-20	2,03,451	రూ.276.65 కోట్లు
2020-21	2,39,363	రూ.323.14 కోట్లు
2021-22	2,46,438	రూ.332.69 కోట్లు
2022-23	2,51,659	రూ.343.55 కోట్లు
2023-24	2,63, 394	రూ.302.57 కోట్లు



విజయనగరం మండలం పినవేమలి గ్రామంలో రైతుల కళ్లం వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది (ఫైల్)

కష్టాలు తొలగాయి...



రైతు భరోసా కేంద్రాలు లేనప్పుడు విజయనగరం వెళ్లి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునే వారం. ఇప్పుడు ఆ కష్టాలు తప్పాయి. మా గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. నేను పండించిన ధాన్యాన్ని కూడా రైతు భరోసా కేంద్రం వద్ద కొనుగోలు చేశారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో డబ్బులు జమ చేశారు.

– పొటుపురెడ్డి వెంకటరావు, రైతు, మధుపాడ, గంట్యాడ

ఏటా రైతు భరోసా..



ఏటా సమయానికి రైతు భరోసా డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయి. రైతు భరోసా కేంద్రం ద్వారా ఈ–క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. దీని వల్ల పంట సాగు చేసిన నిజమైన రైతులకు మాత్రమే లబ్ధి కలుగుతుంది. రైతు భరోసా పథకం కింద డబ్బులు ఇవ్వడం వల్ల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నాను. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం వడ్డీకి అప్పు తెచ్చుకునేవారం. ఇప్పుడు ఆ పరిస్థితి తప్పింది.

– ఎంసత్యనారాయణ, రైతు, పినవేమలి, విజయనగరం

పంపిణీ చేసిన ఎరువుల వివరాలు...

సంవత్సరం	మెట్రిక్ టన్నులలో..
2021-22	25,705
2022-23	22,547
2023-24	6,255

పంపిణీ చేసిన విత్తనాల వివరాలు

సంవత్సరం	విత్తనాలు క్వింటాళ్లలో..
2020-21	34,821
2021-22	37,460
2022-23	41,418
2023-24	42,876

గంగన్నపాడులో అగ్ని ప్రమాదం



గంగన్నపాడులో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పశువుల శాలలు



గంగన్నపాడులో బాధితులతో మాట్లాడుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పశువుల శాలలు దగ్ధం కావడంతో పాటు, ఓ ఆవు మృతి చెందింది. మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. శుక్రవారం అర్ధరాత్రి స్థానిక రైతు భరోసా కేంద్రానికి దగ్గరలో ఉన్న కోట సింహాచలం, కోట సత్యం, కోట సరోజిని, కొత్తకోట సత్యనారాయణలకు చెందిన పశువుల శాలలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో కోట సింహాచలంకు చెందిన ఒక ఆవు మృతి చెందగా.. మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. పశువుల శాలలు కాలిపోతున్నాయని తెలుసుకున్న సంబంధిత రైతులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆదుపు చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి సిబ్బందిని పంపించి నష్టాన్ని అంచనా వేయించారు.

బాధితులను ఆదుకుంటా...

అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గంగన్నపాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద విషయం తెలుసుకొని ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి బాధిత రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ కోట సరోజని ఉన్నారు.

తూకంలో తేడాలొస్తే చర్యలు



డెంకాడ: తూకంలో తేడాలొస్తే చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోధరనాయుడు అన్నారు. మండలంలోని పెదతాడివాడ రేషన్‌డిపో, ఎండీఎం వాహనాలను లీగల్ మెట్రాలజీశాఖ అధికారులు శనివారం తనిఖీ చేశారు. పెదతాడివాడలో ఎండీయూ ఆపరేటర్ కార్డుదారునికి ఇచ్చిన 15 కిలోల బియ్యాన్ని అందరి సమక్షంలో తూకం వేయగా 14 కిలోలు మాత్రమే వచ్చాయి. దీంతో అతడిపై కేసు నమోదు చేశారు. గుణుపూరు, చొల్లంగిపేట, పినతాడివాడ, డెంకాడ, బేతనాపల్లి, గుండాలపేట, బిల్లాం గ్రామాల్లో అధికారులు తనిఖీలు చేశారు. కిరాణి వ్యాపారస్తులపై మూడు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ప్యాకేజీ వస్తువులు ఎంఆర్‌పీకే అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

అయ్యో ‘పాప’ం

- శ్లాబ్ పెచ్చులు పడి పసికందు మృతి



మృతి చెందిన పసికందు వంశిక

పాలకొండ: మూడు నెలల పసికందు..రాత్రంతా తల్లి పక్కన హాయిగా పడుకుంది. తెల్లవారగానే తల్లి ఇంటిపనుల కోసం లేవగా చిన్నారి ఇంకా నిద్రలో ఉంది. అంతలోనే ఇంటి శ్లాబ్ రూపంలో మృత్యువు పసికందును పొట్టన పెట్టుకుంది. తన కళ్ల ముందే శ్లాబ్ పెచ్చుపడి పసికందు మృతి చెందడంతో తల్లి హృదయం తల్లడిల్లింది. ఈ విషాద ఘటన పాలకొండ మండలంలోని వెలగవాడలో శనివారం జరి గింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కేవటి సంజీవు, మంజుల దంపతులకు మూడు నెలల క్రితం పాప పుట్టింది. ఆ పాపక వంశిక అని నామకరణం చేశారు. సంజీవు హైదరాబాద్‌కు వలసకూలీగా వెళ్లి అక్కడే పనులు చేసుకుంటున్నాడు. పాప చిన్నవయస్సు కావడంతో మంజుల గ్రామంలోనే ఇండి పనులు చూసుకుంటోంది. ఎప్పటిలాగానే శుక్రవారం రాత్రి పసికందును పక్కన వేసుకుని బయట వరండాలో చాపపై పడుకుంది. తెల్లవారడంతో మంజుల లేచి ఇంటిపనుల్లో ఉండగా పసికందు అక్కడే పడుకుంది. ఆ సమయంలో ఇంటి శ్లాబ్ పెచ్చుఊడి తలపై పడడంతో పసికందు అక్కడికక్కడే మరణించింది. ఈ సంఘటనతో తల్లి మంజుల సొమ్మసిల్లిపడిపోయింది. ఇరుగుపొరుగు వారు వచ్చి సపర్యలు చేసి ఈ సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



శ్రీనివాసుడి ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద గ్రామంలో గల వేంకటేశ్వర ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి సన్నిధిలో శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా

- ఆరోగ్య శ్రీ సేవలు విస్తృతం
- ప్రతి ఒక్కరి మొబైల్‌లో యాప్
- 2,11,598 హెల్త్ కార్డుల పంపిణీ
- ఐదేళ్లల్లో 75,379 మందికి వైద్యం
- వెచ్చించిన మొత్తం 148.91 కోట్లు



యాప్ డౌన్‌లోడ్‌పై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు(ఫైల్)



పార్వతీపురంటౌన్: అందరికీ ఆరోగ్యాన్ని అందించడం తొలి ప్రాధాన్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తరచూ చెబుతుంటారు. అయితే ఈ మాటలను ఆయన చేతల్లోనూ చూపించారు. అందుకు అనుగుణంగా వైద్య, ఆరోగ్యశాఖపై గతంలో లేనంతగా దృష్టిసారించారు. ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతోపాటు కొత్త పీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పాటు వినూత్నంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరికీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఆపద్బాంధవిగా నిలిచింది. ఈ పథకంలో గతంలో 1,059 చికిత్స విధానాలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3,257కు పెంచింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఈ పథకాన్ని సామాన్యుడికి చేరువ చేయడంతోపాటు ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయించారు. ఇందుకోసం వైద్యశాఖ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. గ్రామ, వార్డు వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

75,379 మందికి రూ. 148.91 కోట్లతో వైద్యం

ముఖ్యంగా గిరిజన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు ముమ్మరం చేశారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతోమందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యాన్ని అందించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా 75,379మందికి రూ. 148.91 కోట్లతో పేదలకు వైద్యసేవలందించి ఆరోగ్య భరోసా కల్పించారు.

2,11,598 ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో 2,11,598 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 350 సచివాలయాల పరిధిలో కార్డుల పంపిణీ చేపట్టారు. సచివాలయాల పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డులు లేనివారికి తక్షణమే కార్డులు అందజేశారు.

యాప్‌తో ఎంతో మేలు

ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. ఈ పథకం సేవలు పరిధి ఏ మేరకు ఉంది, ఏఏ వ్యాధులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేసుకోవచ్చు, నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలను ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్‌లో తెలుసుకోవచ్చు. ఎవరైనా ప్రమాదాలకు గురైనా, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న యాప్ ఉంటే ఎవరి ప్రమేయం లేకుండా యాప్ ద్వారానే కావాల్సిన సమాచారం అందుతుంది. ఈ యాప్ డౌన్‌లోడ్ ప్రక్రియను ముమ్మరంగా చేపడుతున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ యాప్‌ల డౌన్‌లోడ్ లక్ష్యం 2,80,417 లక్షలు కాగా రెండు నెలల్లో శతశాతం డౌన్‌లోడ్ ప్రక్రియ పూర్తి చేశారు.

జిల్లాలో అందించిన సేవలు


నియోజకవర్గం	అందించిన సేవలు	వెచ్చించిన మొత్తం
కురుపాం	19,963	రూ.37.56 కోట్లు
సాలూరు	15,405	రూ.32.55 కోట్లు
పార్వతీపురం	22,277	రూ.44.95 కోట్లు
పాలకొండ	17,734	రూ.33.85 కోట్లు
మొత్తం	75,379	రూ.148.91 కోట్లు

గతంలో చిన్నచూపు

గతంలో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అంటే చిన్న చూపు చూసేవారు. జగన్‌బాబు అధికారంలోకి వచ్చిన తరువాత నాకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డు ఇచ్చారు. మా వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి సమస్యలు గుర్తించారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించారు. అటువంటి నాయకుడు మాకు మళ్లీ కావాలి.

–బి. మణి, ఆరోగ్యశ్రీ లబ్ధిదారు, పార్వతీపురం


గతంలో వైద్యానికి డబ్బులు ఖర్చయ్యేవి



గతంలో వైద్య అవసరాల నిమిత్తం డబ్బులు చాలా ఖర్చయ్యేవి. జగన్ బాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల వద్దకే వచ్చి వైద్యం అందిస్తున్నారు. నా కాళ్లకు ఆపరేషన్ అవసరమని, రూ.30 వేలు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా నాకు ఉచితంగా ఆపరేషన్ చేశారు. జగన్ బాబు ప్రభుత్వంలో పేదలకు ఆరోగ్య భరోసా కల్పించారు.

–జె. దావీదు, ఆరోగ్యశ్రీ లబ్ధిదారు, పార్వతీపురం పట్టణం

ఆపద సమయంలో ఆదుకున్నారు



ఆరోగ్యశ్రీ మాలాంటి పేదలకు వరం. సీఎం జగనన్న పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఆరు నెలల క్రితం నాకు యాక్సిడెంట్ అయింది. చేతికి ఆపరేషన్ అవసరం అవుతుందని వైద్యులు తెలిపారు. సూమారు రూ.25 వేల వరకు ఖర్చవుతుంద న్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లి ఉచితంగా చికిత్స చేయించుకున్నాను. నాలాంటి పేదలకు ఆరోగ్యశ్రీ ఎంతగానో ఉపయోగపడుతోంది.

సిల్లా అనిల్, లబ్ధిదారు, 10వ వార్డు, పార్వతీపురం పట్టణం

గంగన్నపాడులో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పశువుల శాలలు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడులో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పశువుల శాలలు దగ్ధం కావడంతో పాటు, ఓ ఆవు మృతి చెందింది. మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. శుక్రవారం అర్ధరాత్రి స్థానిక రైతు భరోసా కేంద్రానికి దగ్గరలో ఉన్న కోట సింహాచలం, కోట సత్యం, కోట సరోజిని, కొత్తకోట సత్యనారాయణలకు చెందిన పశువుల శాలలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. ఈ ప్రమాదంలో కోట సింహాచలంకు చెందిన ఒక ఆవు మృతి చెందగా.. మరొక ఆవు తీవ్రంగా గాయపడింది. పశువుల శాలలు కాలిపోతున్నాయని తెలుసుకున్న సంబంధిత రైతు లు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆదుపు చేశారు. ప్రమాద విష యం తెలుసుకున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి సిబ్బందిని పంపించి నష్టాన్ని అంచనా వేయించారు.

బాధితులను ఆదుకుంటా...

అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గంగన్నపాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద విషయం తెలుసుకొని ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి బాధిత రైతులను పరామర్శించారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ వినియోగించుకోవాలని ఆర్‌ఓ ఎం. నూకరాజు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకోవాలని కోరారు. స్థానిక సీకేఎం ప్రభుత్వ కళాశాల ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎలక్షన్ ఆర్డర్ కాపీ, ఓటరు గుర్తింపు కార్డు తీసుకుని ఓటు వేసేందుకు ఫెసిలిటేషన్ సెంటర్‌కు నేరుగా వెళ్లి ఓటు వినియోగించుకోవాలని కోరారు.

మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా

- 5కేసుల నమోదు, 8 మంది అరెస్ట్
- ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్

పార్వతీపురం టౌన్: మద్యం అక్రమ అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పార్వతీపురం మన్యం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో గల 53 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 8 బార్లలో అమ్మకాలను పరిమితులకు లోబడి సీసీటీవీ నిఘాలో పర్యవేక్షిస్తున్నామన్నారు. ఐఎంఎఫ్ఎల్ డిపో నెల్లిమర్ల, ఇచ్ఛాడ నుంచి జీపీఎస్‌తో అనుసంధానించిన వాహనాల ద్వారా మద్యం సరఫరా జరుగుతున్నట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిర్వహించిన దాడుల్లో భాగంగా 5కేసులు నమోదు చేసి 8 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.46,250 విలువ గల 253 మద్యం సీసాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహించిన షాపుల్లో పనిచేస్తున్న 1 సూపర్‌వైజర్, నలుగు రు సేల్స్‌మెన్‌ను విధుల నుంచి తొలగించామన్నా రు. ఎక్సైజ్ నేరాలు, ఫిర్యాదులపై సమాచారానికి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాచారం ఉన్నవారు ఫోన్ 9392679980, 8500900923 నంబర్లకు కాల్ చేసి ఎక్సైజ్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చని పిలుపునిచ్చారు. మద్యం అక్రమ అమ్మకాలపై ఎక్సైజ్, ఎస్ఈబీ శాఖల సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.